# ఏ ఫ్రెండ్ ప్రేమ

'కథల సంకలనం చాలా బాగుంది. చక్కటి ఆశయాలు. చక్కటి ఊహలు'. మూడో కథ చదివి వెంకట్రావు, 'చిన్ననాటి స్నేహాన్ని మరిచిపోగలిగాడు పరమేశంగారు. ఏం మనుషులో? మనిషికి పరిసరాలు సంకెళ్ళు, పెద్దతనం ఇరుకు బాట కాబోలు. సంఘం స్థాయి నిచ్చినప్పుడు హాయిని తగ్గించడంకూడా చేస్తుంది కాబోలు' అనుకున్నాడు.

వీథిలో, ఎండాకాలం మండు టెండలో, "ఏ తాజ్‌వాలా ఐస్‌క్రీమ్" అని సాయిబు అరుస్తున్నాడు. ఏ నాటి అరుపో? అచ్చు కాకిలా—మధ్యాహ్నం పూట తుమ్మచెట్టు నీడలో కూర్చుని అరిచే కాకిలా—అరుస్తాడు.

దూరంగా ఆకాశం, తునిగిన మబ్బు తునకలు, దూదిపింజలు... ఆకాశానికి హారాల్లా ఎలెక్ట్రిక్ తీగెలు... ఎదరింటి గోడ కింద వగరుస్తూ కుక్క.

తిన్న అన్నం అరగకపోయినా ఉప్మా తాలింపు. పక్కన టీకి కప్పులు. దూరంగా డీసెల్ కూత. ఆకాశవాణి...

వారానికో ఆదివారం! 'సాయంకాలం ప్లాజా కెళ్ళాలి.' వెంకట్రావు గొణుక్కుని వాల్తుగో కథలోకి దిగాడు. రాణి బయటికి వెళ్ళింది. ఎవరో పిలిచినట్టున్నారు...

నల్లటి నూనె మరకలతో నిండిపోయిన పసుపుపచ్చ టెరిలిన్ షర్టు, తెల్ల పాంటు. షొక్కాకి మూడు చిరుగులు, ఒక రఫ్ కుట్టు. ఒకే ఊడిపోయిన గుండీ... లేని గుండీ వెనక వాతలు పెట్టి ఉన్న పొట్ట. మోకాళ్ళకు పైకుంది కౌబాయ్ పాంటు. ఎప్పుడో చూసిన గుర్తు... ఈ అవతారాన్ని చూసింది రాణి.

"నమస్కారమండీ!" వినయంతో చేతులు జోడించాడు.

"ఏం కావాలి?" ఎప్పుడూ వచ్చే వాళ్ళే అనుకుంటూ అడిగింది రాణి.

"నన్ను సూర్యనారాయణ అంటారు... సూరిని; బాబిగాడి స్నేహితుణ్ణి... ఓ, మీకు తెలియదనుకుంటాను... వెంకట్రావు స్నేహితుణ్ణి... సూరిగాణ్ణి..." చిన్న నవ్వు, కళ్ళలో మెరుపులు జవాబిచ్చాయి.

"లోపలికి పదండి, కూచుందురుగాని." బహువచనం అవసరం లేదేమో అని తటపటాయించి తీర్మానించింది రాణి. 'ఈయన్నో కుచేలుడు కాబోలు...'

"క్షమించాలి... సారీ! రాలేను. ఇక్కడే ఉంటాను... ఇలా అతణ్ణి చూడలేను... నాకే సిగ్గుగా ఉంది." విషయం గమనించి అన్నాడు సూరి.

"ఫర్వాలేదు. రండి. కలుసుకొని వెళ్ళండి."

"లేదు... మరోసారి... బాగున్నప్పుడు... చిన్నప్పుడు బాబిగాడు... వెంకట్రావుగారు... క్షమించాలి... చూడలేను." తొట్రుపడకుండా, సాఫీగా పలికానుకొన్నాడతడు.

"మరి నే నేం చేస్తాను? మీ ఇష్టం." లోపలికి పోవడానికి తయారయింది రాణి.

"మీ రో సాయం చేయాలి."

రాణి కాళ్ళకి బ్రేక్ పడింది. 'ఏమిటి?' ముడతలుపడ్డ నుదురే ప్రశ్నించింది.

"మరేం లేదు... ఆకలిగా ఉంది. మూడు రోజులనించి మంచినీళ్ళ తప్ప లేవు. ఒక అయిదు రూపాయలుంటే ఇయ్యండి. తిరిగి ఇయ్యడానికే ప్రయత్నిస్తాను."

"ఆయ న్నడి..."

"ఆహాఁ... లేదు... క్షమించాలి. ఇలా అతణ్ణి కలుసుకోడం... మీ దగ్గిరుంటే సర్దెయ్యాలి..."

"నా దగ్గిర ప్రస్తుతం లేవే... ఆయన్ని అడిగి..."

"వద్దు... ఊహూఁ... వద్దు.. పోనీ, మీరు చేయగలిగిన సహాయం... ఈ పూట...ఈ పూట భోజనం పెట్టాలి." ఆత్రతగా ఎదురు చూశాడు.

నిజమైన స్నేహితుడైనా కాకపోయినా, మంచివాడైనా దుర్మార్గుడైనా ఆకలిగొన్న వాడికి అన్నం పెట్టడంలో తప్పేముంది?

"అలాగే. ఏడు గంటలకి రండి, భోజనం చేద్దురుగాని" అంది. అవగలిగినందు కానందించింది.

మెల్లిగా వెళ్ళిపోయా డతను.

వెంకట్రావు మనిషిని చూశాడు. చూచాయగా మనసులో మెదిలాడు సూర్యం... చిన్నప్పుడు కలిసి చదివిన సూరిగాడు... వాలీబాల్ బాగా ఆడేవాడు.

మంచివాడే. ఆ తరవాతే... అధోగతి పా లయ్యాడు. అతణ్ణి కలుసుకోడానికే అసహ్యం వేసింది.

"ఎవరొచ్చారు, రాణీ?"

"ఎవరో, అడ్రసేదో అడగడానికి వచ్చాడు. వెళ్ళిపోయాడు."

వెంకట్రావు మనస్సులో నవ్వుకున్నాడు.

* * *

సాయంకాలం "సినిమా కెడదాం, పద" అన్నాడు వెంకట్రావు.

"లేదు. మీరు వెళ్ళండి. తల నొప్పిగా ఉంది."

"నిజంగానా?"


"......" కళ్ళెత్తి చూసింది రాణి.

వెంకట్రావుకి తెలుసు. తనకీ ఆమె ద్వారా సూర్యానికి సాయం చేయాలనే ఉంది.

అతడికి తనే సహాయం చేయాలంటే 'అక్రమం... అక్రమం!' అని మెదడు అరుస్తూంది.

'లేదు. ఫరవాలేదు... బ్లాక్‌లో సహాయం చేయి' అని గుండె—మనసూ, మానవత్వంగలది—గుసగుస లాడింది. రక్తంలో ఉన్న పిరికితనమో, మంచితనమో బలవంత పెట్టింది. అతడు మనిషి. అంగీకరించాడు. రాణిని మరి బలవంతం చెయ్యక, తనని తాను బ్లాక్ చేసుకొని సినిమాకి వెళ్ళిపోయాడు.

ఏడు గంటలు కొట్టింది గడియారం. మరో అయిదు నిమిషాల్లో మరో రెండు, మూడు గడియారాలు "ఏడు" అన్నాయి.



వీథి గేటు దగ్గిర పసుపుపచ్చ టెరిలిన్ షర్టు రెపరెప లాడింది. రాణి 'రండి' అన్నట్టుగా చూసింది.

# హోటల్

'అశ్విని'

**సంఘం వేసిన సంకెళ్లలో బిగిసి, బంగారు పంజరపు బ్రతుకే సుఖం అనుకునే మనం, మానవత్వానికి ఎంతో దూరంగా వెళిపోతున్నాం. మనిషిని మనిషిగా గౌరవించలేక, అతని అలవాట్లను బట్టి, అంతస్తునుబట్టి విలువలను ఆపాదిస్తున్నాం. ఎవరు నరకం నుండి వస్తున్నట్లు, ఎవరు నరకంలోకి పోతున్నట్టు?**



అతడు ముందు వెనక చూస్తున్నాడు.

"వెంకట్రావు ఉన్నాడా?"

"లేరు"

లోపలికి వచ్చాడు. కాళ్ళకి బొగ్గు పొడి, నూనె కలిపి రాసినట్టుగా మడ్డి.

"కాళ్ళు కడుక్కోండి. ఇక్కడ నీళ్ళు ఉన్నాయి."

"అన్నం వడ్డించండి. అతడు వచ్చే లోగా వెళ్ళిపోవాలనుంది."

'వంటింట్లో వడ్డించాలా? బయట గది దగ్గరా?' అన్న ఆలోచన వచ్చింది రాణికి.

వంటింట్లోనే విస్తరి వేసి, పీట వేసి, మంచినీళ్ళు పెట్టింది.

"రండి. భోజనం చేద్దురుగాని."

సూర్యం మెల్లగా వచ్చి కూర్చున్నాడు. తల వంచుకుని అరటికాయ కూర కలిపాడు. నెయ్యి వేసింది.

"ఎబ్బే, నెయ్యెందుకండీ?" మౌనంగా రెండు ముద్దలు తిన్నాడు.

"చాలా బాగా వండారండీ! అద్భుతంగా ఉంది. ఎన్నాళ్ళయిందో ఇంత రుచి చూసి . . ."

"మరి కొంచెం వెయ్యమంటారా?" కొంచెం వేసి అడిగింది.

"ఇక చాలండీ!" గబగబా తింటున్నాడు.

కళ్ళలో నీళ్ళు తిరిగాయి రాణికి. "మెల్లిగా తినండి." గొంతు వణికింది. "తొందరలేదు."

ఆమె గొంతు గుర్తించాడు సూర్యం. ముఖం ఎత్తితే పరిస్థితి బాగుండదు. తత్తరపడేను చెల్లెమ్మ. "ఫర్వాలేదులెండి. . . అంతే. . . నే సరాగే తింటాను. . ." ఆప్యాయత, అమ్మ పెట్టిన అన్నం జ్ఞాపకాలు గొంతు కడ్డు పడ్డాయి.

"చిన్నప్పుడు నేనూ, వెంకట్రావూ చాలా దగ్గరగా ఉండేవాళ్ళం . . . చదువులో సాయం చేసేవాడు. నేను బాడీగార్డులా తిరిగేవాణ్ణి. వాడికి. . . అదే వెంకట్రావుకి. . ."

"స్కూల్ ఫైనల్ తరవాత తను కాలేజీకి వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళ తరవాత పారిపోయి మిలిటరీలో చేరాను. అప్పుడే పెద్దైపోయాను. అదీ నచ్చలేదు. . . పారిపోయి వచ్చాను. ఎక్కడైనా దొరికితే పట్టుకుంటారు."

"ఎందుకు పారిపోయి వచ్చారు? ఛీ ఛా, చాలా పొరపాటు చేశారు." గుండె పొంగిన మాట లొలికించింది చెల్లెమ్మ.

"ఇప్పుడు నాకూ అలాగే అనిపిస్తోంది. అయినా వెళ్ళాలని లేదు. తప్పు నేనే పాడుచేసుకున్నాను."

ఆవకాయ అన్నం పూర్తిచేశాడు. "ఆవకాయుంటే నాకు మరేమీ అక్కర్లేదు." చక్కగా, నిష్కల్మషంగా మెల్ల మెల్లగా నవ్వాడు. "వెంకట్రావు చూడలేదు కదూ నన్ను?"

మజ్జిగన్నం కలుపుతూ అన్నాడు: "మంచివాడు. చిన్నప్పుడు బాగా సాయం చేసేవాడు. అప్పుడప్పుడు నోట్సుకోసం వెళ్ళి, ఇవ్వకపోతే బెదిరించేవాణ్ణి."

మళ్ళీ తన్మయుపరిచే చక్కని నవ్వు. గతాన్ని కళ్ళముందు చిత్రించుకుని విస్మయం పొందుతున్నాడు.

'పాపం' అని గొణుక్కుంది రాణి. "మీరు ఇలా పారిపోయి రాకుండా ఉండవలసింది."

విస్తరి మడతపెట్టి తనే బయటికి తీసుకువెళ్ళాడు. రాణి కంగారు పడింది. తన్ను తాను నిందించుకొంది.

"ఆఁ, ఆ తువ్వాలుతో తుడుచుకోండి."

తిన్నచోట శుభ్రం చేద్దామని వెళ్ళబోయాడు.

"వద్దండీ, అలా ఉంచెయ్యండి నే చేసేస్తాగ! అనవసరంగా విస్తరి కూడా మీ చేత తీయించాను." ఈసారి ఆమె చేయి పట్టుకుని ఆపింది

## వల వలువలు

మరీ ఈత డ్రాయర్ ఒక్కటే కాదు; క్రిందా, పైనా కూడా అచ్ఛాదన ఉన్నదని చెప్పడానికి గైల్ మిల్లర్ తయారుచేసిన వలువల నమూనా. వేసవి సెలవులలో సముద్రతీర విహారాలకు వెళ్లే యువతులకు ఇది వచ్చే సంవత్సరం ఫాషన్! యౌవనాన్ని దాచుకో నవసరం లేదు. అని మరీ ప్రదర్శించ నవసరం లేదు. ఇది ఉభయ ప్రయోజనకారి.



మౌనంగా వరండాలోకి వచ్చాడు. "మీరు మరొక్క సాయం చేయాలి. రెండ్రోజులు అన్నం లేక పోయినా ఫరవాలేదు కాని, సిగరెట్లు లేకుండా ఉండలేను. మీ దగ్గిర. . . ఇలా అడుగుతున్నందుకు క్షమించాలి... ఎంత ఉంటే . . . అంత . . ."

కాదనలేకపోయింది రాణి. సోదరిగా, అమ్మగా మనవలిసిన ఆడది. అక్కడా, ఇక్కడా ఉన్న చిల్లర . . . ఎనభై మూడు పైసలు. . . దొరికాయి.

"నా దగ్గిర ఇంతకంటే లేదు. ఏమనుకోకండి."

"థాంక్స్. మీరు చేసిన సాయం మరిచిపోలేను. వెడతాను."

"కాసేపు కూర్చోండి, వెళుదురు గాని." మనిషికి ఆమాత్రం 'ఇది' ఉండదూ?

"లేదు. క్షమించాలి." మనిషికి అభిమానం మెండు "వెళ్లిపోతాను. మీ మేలు మరిచిపోలేను. నమస్తే." చేతులు జోడించి గబగబా బయటికి నడిచాడు.

వెనక్కి తిరిగిన ఆతడి కంటిసీరు కనిపించిన రాణి కళ్లకి కదులుతూ ఇద్దరు సూర్యాలు కనిపించారు.

'పాపం, లంగరులేని బ్రతుకు. ఆతడి జీవితం సుగమం చేయి, భగవాన్!' గొణిగింది రాణి.

రాత్రి పది గంటలకి వెంకట్రావు వచ్చాడు. "సినిమా బాగుందా?" అంటే "ఊఁ" అన్నాడు.

అన్నం వడ్డించింది. అరటికాయ కూర. "బాగుంది. చక్కగా కుదిరింది."

"ఇంకొంచెం వెయ్యనా?"

"నువ్వేసుకో."

"సూర్యం ఏమన్నాడు? నాకు తెలుసులే. మధ్యాహ్నమే చూశాను."

"ఏం లేదు. భోజనంచేసి వెళ్లాడు."

అవకాయన్నం తింటున్నారు.

"మంచివాడే సూర్యం. తరవాత తరవాత పాడైపోయాడు. కొన్నాళ్ల క్రితం నాతో కలిశాడు . . . కసురుకున్నాను. . . గుండెలు విప్పి మాట్లాడుకోలేకపోయాం. . .

"చిన్నప్పుడు. . . కనీసం వాడితో తిరగడాని కభ్యంతరముండేది కాదు. నాకు, మరెవ్వరికి తగాదా వచ్చినా అడ్డు పడేవాడు. ఈవేళ... ఊఁహూఁ... ఏమిటో?" నిట్టూర్చాడు.

రాణి మౌనంగా వింటూంది.

"పరీక్షల్లో చూపించమనే వాడు. అది తప్పని తెలుసు. నాకే తెలియనట్లుగా, కాయితాలు కనపడేట్లు పెట్టి వ్రాసేవాడిని."

మజ్జిగ తాగుతూ మూసుకున్న కళ్ల వెనక ఫ్లాష్‌బాక్. . .

"ఈ నాడూ అంతే. అతణ్ణి కలుసుకోలేకపోయాను. కలుసుకోవాలనుంది. కలుసుకోలేను. సాయం చేయకూడదని కోపం వస్తుంది. తాగుబోతు, తిరుగుబోతు అని ఒళ్ళు మండుతుంది. అయినా. . ." బాధగా తల ఊపి, చేతులు కడుక్కున్నాడు.

"మధ్యాహ్నమే గుర్తు పట్టాను. గుర్తు పట్టనట్టు నటించాను. వాడూ చూసినట్టున్నాడు. నా గుండెలు మండిపోతున్నాయి. . . అన్యాయం చేశాను. కలుసుకోవలిసింది."

"బాధ పడకండి. పరిస్థితు లలాటివి. నాకే బాధగా ఉంది. మీకు ఉండటం అతి సహజం 'భగవాన్! ఇలాటివారికి మార్గం చూపించు'. అని ప్రార్థించ గలం. సంఘం వేసిన సంకెల లలాటివి. మనం బంగారు పంజరంలో సుఖంగా ఉన్న చిలకలం! పోన్లెండి...భోజనం చేశాడు. ఏదో కొద్ది సాయం చేయగలిగాం."

"లేదు, రాణీ! చాలా బాధగా ఉంది. నా ఈ పనిని నేనే క్షమించలేను ... ఛ ఛ . . . డబ్బిలిస్తే పాడవుతాడని భయం . . . నీ వేమైనా ఇచ్చావా?"

"లేదు. . . ఇయ్యలేదు."

"ఇచ్చి ఉండవలిసింది, పాపం... ఎటు వెళ్లాడో?" తల రాణి ఒళ్లో పెట్టుకుని పడుకున్నాడు. కళ్లలో నీళ్ళు తిరుగుతున్నాయి. రాణికీ అలాగే ఉంది.

'ఏ ఫ్రెండ్ ఫ్రమ్ హెల్.' గొణిగాడు వెంకట్రావు.

"అతడి మార్గం సుగమం కావా"లని కోరుకుంటూన్న వా రిద్దర్నీ నిద్రాదేవి ఒడిలోకి లాక్కుని, ప్రేమగా నిమురుతూన్న క్షణాన ఎక్కడో నడుస్తూన్న సూర్యం కంటినించి ఆనందబాష్పాలు రాలాయి కృతజ్ఞతాపూర్వకంగా. ★